

ఆర్నెల్లుగా ఖాళీనే..

బదిలీల్లో జెడ్పీ కార్యాలయానికి 30 మంది ఉద్యోగుల రాక

జిల్లా పరిషత్‌లో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. ఈ ప్రభావం ఆరు నెలల క్రితం జరిగిన ఉద్యోగుల బదిలీలపై పడింది. కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీపై జెడ్పీ కార్యాలయానికి వచ్చిన 30 మంది ఉద్యోగులకు నేటికీ సీట్లు కేటాయించకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. గట్టిగా అడిగితే జూనియర్ అసిస్టెంట్‌ల వద్ద పనిచేయాలని సీనియర్ అసిస్టెంట్ హోదాలోని ఉద్యోగులకు సలహా ఇస్తున్నారు. దీంతో ఆరు నెలలుగా 30 మంది ఉద్యోగులు కార్యాలయానికి వచ్చి ఖాళీగా కూర్చుని వెళ్లిపోతున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

6

విధులు నిర్వర్తించేందుకు సీట్లు కేటాయించని అధికారులు

- అడిగితే జూనియర్‌ల వద్ద పనిచేయాలని సీనియర్ అసిస్టెంట్‌లకు సలహా
- జెడ్పీ చైర్‌పర్సన్, సీఈవో మధ్య విభేదాలే కారణమని సమాచారం
- ఉద్యోగులకు సీట్లు కేటాయించే అధికారం ఉన్నా పట్టించుకోని జెడ్పీ సీఈవో
- కలెక్టర్ చొరవచూపి న్యాయం చేయాలని వేడుకోలు



జెడ్పీ కార్యాలయం



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జెడ్పీ ఉద్యోగుల బదిలీలను ఈ ఏడాది జూన్‌లో కౌన్సెలింగ్ పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో జెడ్పీ చైర్‌పర్సన్ తాను చెప్పినట్లుగానే బదిలీలు నిర్వహించాలని చెప్పగా, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కౌన్సెలింగ్ పద్ధతిలోనే బదిలీలు చేస్తామని జెడ్పీ సీఈవో పట్టుబట్టారు. చివరకు కౌన్సెలింగ్ పద్ధతిలోనే 104 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. వీరిలో ఎంపీడీవోలు, సీనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర విభాగాల ఉద్యోగులు ఉన్నారు. బదిలీలు జరిగినా.. వారిలో చాలామందిని చాలా రోజుల పాటు రిలీవ్ చేయకుండా జాప్యం చేశారు. అతికష్టం మీద ఉద్యోగులు బదిలీ అయిన ప్రాంతాలకు వెళ్లారు. వీరిలో 30 మంది సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, ఇతర కిందిస్థాయి సిబ్బంది జెడ్పీ కార్యాలయానికి బదిలీపై వచ్చిన వారు ఉన్నారు. అయితే జెడ్పీ కార్యాలయంలో వీరు ఏ విభాగంలో పనిచేయాలో సీట్లు కేటాయించకుండా ఇంతకాలంగా జాప్యం చేస్తూ వస్తున్నారు. తమకు సీట్లు కేటాయించమని ఉద్యోగులు కోరితే ఎవరో ఒకరి వద్ద తాత్కాలికంగా పనిచేయండి, తర్వాత మీకు సీట్లు కేటాయించే అంశంపై నిర్ణయం తీసుకుంటామంటూ దాటవేత ధోరణిని గత ఆరు నెలలుగా కొనసాగిస్తున్నారు. జిల్లా పరిషత్ చరిత్రలో ఆరు నెలల పాటు 30 మంది ఉద్యోగులకు సీట్లు కేటాయించకుండా ఖాళీగా ఉంచి, జీతాలు చెల్లించిన దాఖలాలు లేవని జెడ్పీ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

జెడ్పీ సీఈవోకు అధికారం ఉన్నా..

జిల్లా పరిషత్ యాజమాన్యంలో పని చేసే ఉద్యోగులకు బదిలీలు ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ పద్ధతిలోనే జరిగాయి. ఈ వివరాలను ప్రభుత్వానికి కూడా పంపారు. ఈ నేపథ్యంలో జెడ్పీ కార్యాలయానికి బదిలీపై, పదోన్నతిపై వచ్చిన ఉద్యోగులకు జెడ్పీ సీఈవో తన అధికారాలను ఉపయోగించి సీట్లు కేటాయించవచ్చని జెడ్పీ ఉద్యోగులు అంటున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌కు చెప్పి ఉద్యోగులకు సీట్లు కేటాయించాలనే ఉత్తర్వులు కూడా ఏమీ లేవని పేర్కొంటున్నారు. కానీ పరిపాలనాపరంగా జెడ్పీ సీఈవో, జెడ్పీ చైర్‌పర్సన్‌కు మధ్య ఉన్న విభేదాల కారణంగా ఉద్యోగులకు సీట్లు కేటాయించకుండా ఆరు నెలలుగా జాప్యం చేయడం గమనార్హం. జెడ్పీ చైర్‌పర్సన్ వద్ద ఈ ఫైలు పెండింగ్‌లో ఉందని చెప్పి జాప్యం చేస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. జిల్లా పరిషత్ ఉద్యోగుల కౌన్సెలింగ్ జరిగే సమయంలో మీ ఇష్టానుసారంగా ఉద్యోగులను బదిలీ చేస్తే సంబంధిత బదిలీల ఫైల్‌పై సంతకం పెట్టేది లేదంటూ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఖరాఖండిగా చెప్పినట్లు ఉద్యోగులు అప్పట్లో చెప్పుకున్నారు. కలెక్టరేట్ పక్కనే ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆరు నెలలుగా 30 మంది ఉద్యోగులకు సీట్లు కేటాయించకుండా, ఖాళీగా కూర్చోబెడుతుండటం చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ ఈ అంశంపై దృష్టి సారించి సమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలని జెడ్పీ ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

- జెడ్పీ స్థాయి సంఘాల సమావేశంలో పలు అంశాలపై సమీక్ష
- డిసెంబరులో నూతన పింఛన్ల దరఖాస్తుల పరిశీలన
- పారదర్శకంగా పంటల పరిహారం అంచనాలు వేయాలని సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, చిత్రంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందప్రసాద్

మచిలీపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం ఒకటి నుంచి ఏడు వరకు జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తెచ్చిన ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో పారిశుధ్య నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, రహదారులకు మరమ్మతులు, తాగునీటి సరఫరా, పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం తదితర సమస్యలు ఉన్నాయని తెలిపారు.

కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారు?

జిల్లాలో గత 18 నెలలుగా కొత్త పింఛన్ల మంజూరు నిలిపివేశారని, ఒక్కో మండలంలో వందలాది దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయని, అర్హులైన వారికి ఎప్పుడు ఇస్తారని జెడ్పీ మిగతా 6లో..

గృహ నిర్మాణ బిల్లులు ఇప్పించండి

గూడూరు మండలం మల్లవోలు తదితర గ్రామాల్లో నూతనంగా గృహాలు నిర్మాణం చేస్తున్న లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్‌లో పెడుతున్నారని, వెంటనే ఇప్పించాలని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ కోరారు. గృహ నిర్మాణ బిల్లుల చెల్లింపులు చేస్తున్నామని, ఎక్కడైనా బిల్లులు పెండింగ్‌లో ఉంటే మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. సొంత స్థలం ఉండి గృహ నిర్మాణం చేసుకునేందుకు ముందుకు వచ్చిన వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా గృహాలు మంజూరు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించారని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని గృహ నిర్మాణ సంస్థ అధికారులు వివరించారు.

ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలకం వద్ద ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే వర్ల, డీసీఎంఎస్ చైర్మన్ బండి, వీసీ రాంజీ, కలెక్టర్ బాలాజీ తదితరులు



పారిశ్రామిక ప్రగతి

కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎంఎస్ఎంఈ పార్కు

వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు ▸ హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామిక రంగం మరింత వృద్ధి చెందుతోంది. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ పరిశ్రమల ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. బందరు పోర్టు నిర్మాణం పూర్తయితే పోర్టు ఆధారిత పరిశ్రమలు వస్తాయన్నారు. పరిశ్రమలకు ప్రభుత్వం భూములు కేటాయిస్తోందని తెలిపారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమలు నెలకొల్పే వారికి అన్నివిధాలా రాయితీ ఇస్తుందన్నారు. కేయు వీసీ కూన రాంజీ మాట్లాడుతూ యువత స్వయంగా పరిశ్రమలు నెలకొల్పే స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, పారిశ్రామికవేత్త వేమూరి సత్యనారాయణ, రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎస్.ఉష తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన అతివేగం

గండిగుంట వద్ద రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకుల మృతి

విజయవాడ- మచిలీపట్నం ఎన్‌హెచ్, సర్వీసు రోడ్డుకు మధ్య ఘటన

- గుంతలో పడి 30 మీటర్లు పల్టీలు కొట్టిన కారు
- పెద్ద బండరాయిని ఢీకొని గాల్లోకి లేచిన వాహనం
- నాలుగు కుటుంబాల్లో తీవ్ర విషాదం
- మృతులు విజయవాడ, కుందేరుకు చెందిన వారు





కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు, ప్రమాదంలో నుజ్జయిన కారు



రాకేష్ పాపారావు ప్రిన్స్‌బాబు చింతయ్య

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/ఉయ్యూరు): "అప్పటి వరకు రహదారిపై సాఫీగా వెళ్తున్న కారుకు ఎదురుగా మరో వాహనం అడ్డురావడంతో డ్రైవర్ ఒక్కసారిగా దాన్ని తప్పించే ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమంలో కారు అదుపు తప్పి పల్టీలు కొడుతూ గాలిలోకి ఎగురుతుంది. ఆ తర్వాత మళ్లీ నేలపై పల్టీలు కొట్టుకుంటూ ముందుకెళ్లి ఆగుతుంది" ఇది చాలా సినిమాల్లో కనిపించే దృశ్యం. ఇలాంటి ఘటనే కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలంలో జరిగింది. కాకపోతే ఇక్కడ సినిమా స్టంట్లను తలపించేలా పల్టీలు కొట్టిన కారుకు ఏ వాహనం అడ్డురాలేదు. పరిమితికి మించిన వేగంతో కారును నడిపిన యువకుడు దానిని నియంత్రించుకోలేకపోయాడు. ఫలితంగా కారు కొట్టిన పల్టీలు నలుగురి ప్రాణాలను తీశాయి. ఉయ్యూరు మండలం గండిగుంట వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదం నాలుగు కుటుంబాలను విషాదంలో ముంచింది. ఈ ప్రమాదంలో విజయవాడకు చెందిన ముగ్గురు యువకులు, కంకిపాడు మండలం కుందేరుకు చెందిన మరో యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

అతివేగం.. అదుపు తప్పి

నైట్‌రైడ్‌కు బయలుదేరిన ఈ యువకులు మితిమీరిన వేగంతో ప్రయాణించినట్టు పోలీసులు గుర్తించారు. కారును రాకేష్ నడుపుతున్నాడు. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారికి, సర్వీసు రోడ్డుకు మధ్యన గండిగుంట వద్ద కొంతదూరం మైనర్ డ్రెయిన్ వంటి బోదె ఉంది. రహదారి మొత్తం విశాలంగా ఉండడంతో రాకేష్ పరిమితికి మించిన వేగంతో కారును నడిపాడు. వేగం ఎక్కడా తగ్గించకపోవడంతో అదుపు తప్పింది. దీంతో కారు బోదెలోకి దూసుకుపోయింది. 30 మీటర్ల దూరం పల్టీలు కొట్టింది. అక్కడ ఒక పెద్ద బండరాయి ఉండడంతో దాన్ని ఢీకొట్టి గాల్లోకి ఎగిరింది. గాల్లోను కొద్దిసేపు పల్టీలు కొట్టిన తర్వాత సర్వీసు రోడ్డుపై పడింది. అక్కడి నుంచి మరో 70 మీటర్లు పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి ఆగిపోయింది. ఈ ఘటనలో రాకేష్, ప్రిన్స్‌బాబు, చింతయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పాపారావు మాత్రం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

నైట్ రైడ్‌కు వెళ్లారా?

విజయవాడ మొగల్రాజపురానికి చెందిన చాట్రగడ్డ రాకేష్(24) పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరిగా పనిచేస్తున్న తండ్రి చక్రపాణికి సహాయకుడిగా ఉంటున్నాడు. గిరిపురానికి చెందిన గొరిపర్తి పాపారావు(23), ఈటె ప్రిన్స్ బాబు(22) స్నేహితులు. పాపారావు తండ్రి శివయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పాపారావు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా మిగతా 6లో..

మెగా పరిణామం!

ఎంఏయూడీకి గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనలు



గ్రేటర్ విజయవాడ దిశగా మరో అడుగు ముందుకు పడింది. ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం నుంచి తుది ప్రతిపాదనలు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ)కి అందాయి. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మునిసిపల్ మంత్రి పి.నారాయణ గ్రేటర్ అంశాలపై చర్చించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరో వారం, పది రోజుల్లో నగర, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- మంత్రి నారాయణ అధ్యక్షతన త్వరలో కీలక సమావేశం
- నగర, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో జరగనున్న సమీక్ష
- విజయవాడ పక్కనే ఉండటంతో కానూరు, తాడిగడప, పోరంకి ప్రాంతాల అభివృద్ధి
- గ్రేటర్ విజయవాడలో ఉండాలని, ఎన్టీఆర్ జిల్లాలో కొనసాగాలని ప్రతిపాదిత గ్రామాల ప్రజల డిమాండ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అడుగులు పడ్డాయి. గ్రామ పంచాయతీల స్థాయిలో తీర్మానాల ప్రక్రియ కూడా పూర్తయింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమరావతిపై ఉన్న కోపాన్ని విజయవాడ మీద కూడా చూపించింది. విస్తరిస్తున్న విజయవాడ సమీప ప్రాంతాలను చిన్న చిన్న మున్సిపాల్టీలుగా చేసి గ్రేటర్ ఆశలను సమాధి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. గ్రేటర్ విజయవాడ విషయమై ప్రజాప్రతినిధుల దగ్గర ప్రజలు ఏకరువు పెట్టడం మొదలు పెట్టారు. దీంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఒకడుగు ముందుకు వేసి గ్రేటర్ విజయవాడ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన మిగతా 6లో..



విజయవాడతో సమానంగా అభివృద్ధి

విజయవాడను ఆనుకుని విజయవాడతో సమానంగా తాడిగడప, కానూరు, పోరంకి, యనమలకుదురు, గంగూరు వంటి ప్రాంతాలు అభివృద్ధి చెంది ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత 20 ఏళ్లుగా గ్రేటర్ విలీన గ్రామాల్లో వీటిని చేర్చుతూ వస్తున్నారు. విజయవాడను ఆనుకుని నగరంతో సమానంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతాలను గ్రేటర్ పరిధిలోకి తీసుకురావటం కూడా ముఖ్యమే. ఈ అంశంపై కూడా మంత్రి నారాయణ అధ్యక్షతన జరిగే సమావేశంలో చర్చకు దారి తీసే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల అభివృద్ధి అంతా కూడా దగ్గరగా ఉన్న విజయవాడ మీద ఆధారపడి ఉంది. అలాంటిది విజయవాడతో సంబంధం లేదంటే మాత్రం ఈ ప్రాంతాల భవిష్యత్తు వృద్ధిపై ప్రభావం చూపే అవకాశాలు కూడా ఉంటాయి. పెనమలూరు, కంకిపాడు మండలాలను గ్రేటర్ విలీన ప్రతిపాదనలోకి తీసుకు వస్తారా ? మినహాయిస్తారా ? అన్నది చర్చనీయాంశంగా మారుతోంది.

మినుము గోవిందా!
- జిల్లాలో అత్యధికంగా పంట నష్టపోయిన రైతులు
- ప్రభుత్వ ఆదుకోవాలని వేడుకోలు

6

ఆజాద్ సేవలు మరువలేనివి
- కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కూన రాంజీ

ముగ్గురు బాలికలు అదృశ్యం

8



ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈవో

దుర్గగుడి భద్రతపై అప్రమత్తం

- అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వండి
- ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందికి ఈవో ఆదేశం

ఇంద్రకీలాద్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ దుర్గగుడి సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మహామండపం నాలుగో అంతస్తులో ఆయన భద్రతా సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో భద్రతా సిబ్బందికి, నిర్వాహక బృందాలకు పలు సూచనలు చేశారు. భక్తులను 'జై భవాని' అని పలకరించాలని, వారితో అత్యంత మర్యాదపూర్వకంగా, వినయంతో మాట్లాడాలని ఈవో సూచించారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ఘాట్ రోడ్డు, మహామండపం వద్ద భక్తులను భాగస్వామ్య పద్ధతిలో (రోప్ వ్యవస్థ ద్వారా) కొద్దికొద్దిగా అనుమతించాలని, తద్వారా భక్తులు తోపులాటకు గురికాకుండా, క్యూలలో తొక్కిసలాటలు జరగకుండా నివారించవచ్చని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో, క్యూలలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు కనిపిస్తే వెంటనే ఆలయ పోలీస్ అవుట్‌పోస్టుకు లేదా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. దుర్గాఘాట్‌లో యాత్రికులను అప్రమత్తం చేయాలని, కనకదుర్గానగర్‌లో లగేజ్, క్లోక్ రూములో భద్రపరిచే చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ ఆదేశాలను భద్రతా సిబ్బంది, సంబంధిత విభాగాలు కచ్చితంగా పాటించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఈవో శీనా నాయక్ స్పష్టం చేశారు. సమావేశంలో ఆలయ అధికారులు, సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

14, 15, 16 తేదీల్లో ప్రత్యేక దర్శనం

ఇంద్రకీలాద్రి : కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 14, 15, 16 తేదీలలో భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నట్టు ఆలయ చైర్మన్ బి.రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 20తో కార్తీక మాసం ముగియనుండటంతో పెద్దఎత్తున భక్తులు కార్తీక వన సమారాధన కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా దేవస్థానం కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుందన్నారు. నవంబరు 14, 15, 16 తేదీల్లో ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు రూ.500లు ప్రత్యేక దర్శనం టిక్కెట్ల విక్రయం తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని, ఈ సమయాలలో అంతరాలయ దర్శనానికి ఎటువంటి వీఐపీ సిఫార్సు లేఖలు (సిఫార్స్ దర్శనాలు) అనుమతించబడవని తెలిపారు. ఈ మూడురోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల మధ్య భక్తులందరికీ బంగారు వాకిలి ద్వారా దర్శనం కల్పించబడుతుందని తెలిపారు. వీఐపీలు సహకరించవలసిందిగా ప్రకటనలో కోరారు.

పశుసంవర్ధక శాఖలో పదోన్నతులు

- 24 మంది ఏడీలకు డీడీలుగా పోస్టింగ్‌లు

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో 24 మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి కల్పించి, పోస్టింగ్‌లు ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. దుత్తలూరులోని ప్రసన్న ఆంజనేయరెడ్డిని చిత్తూరు వెటర్నరీ పాలిక్లినిక్, అక్కడి రాజశేఖర్‌రెడ్డిని హిందుపూర్ పాలిక్లినిక్, బేతంచర్లలోని వసంతలక్ష్మిని కర్నూలు, ముక్త్యాలలోని శ్రీనివాసరావును నరసరావుపేట, శ్రీకాకుళం జిల్లా కొత్తూరులోని శ్రీనివాసరావును విశాఖ డీఎల్‌డీఏ ఈవోగా, కృష్ణా జిల్లా మొవ్వలోని శ్యామూల్ ఆనంద్ దివాకర్‌ను పులివెందుల, నరసాపురంలోని సుధాకర్‌ను గుంటూరు జిల్లా చేబ్రోలు డీఎల్‌డీఏ ఈవోగా, మర్రిపాడులోని జైచంద్రను ఒంగోలుకు, వెలుగోడులోని వెంకటేశ్వర్లును కడపకు, గరుగుబిల్లిలోని వెంకట్రామిరెడ్డిని విజయవాడలోని హెడ్‌ఆఫీస్‌కు, కురిచేడులోని సయ్యద్ రసూల్‌సాహెబ్‌ను మదనపల్లి, గణపవరంలోని నాయక్‌ను తాడేపల్లిగూడెం డీఎల్‌డీఏ ఈవోగా, పాయకరావుపేటలోని శ్రీధర్‌ను కంకిపాడు, రాపూరులోని అనిల్‌కుమార్‌ను తిరుపతి, కుప్పంలోని కుమారిని తిరుపతి డీఎల్‌డీఏ ఈవోగా, ఇందుకూరుపేటలోని మురళీకృష్ణను ఒంగోలు డీఎల్‌డీఏ ఈవోగా, తిరుపతి ఎస్వీవీయూలోని బైరాగిని విశాఖ స్మైల్‌కు, ఎడ్లపాడులోని శ్రీనివాసరావును గుంటూరు, విజయవాడ జేడీ ఆఫీస్‌లోని శ్రీనివాసరావును హెడ్‌ఆఫీస్‌కు, అమలాపురంలోని కోటిలింగరాజును భీమవరం, మారేడుమిల్లిలోని సూర్యనారాయణమూర్తిని శ్రీకాకుళం, ప్రొద్దుటూరులోని రాజాతిమ్మారెడ్డిని కడప డీఎల్‌డీఏ ఈవోగా, రావులపాలెంలోని ఉమామహేశ్వరరెడ్డిని ఉరవకొండ, నాగులుప్పలపాడులోని నాగభూషణరావును గన్నవరం డీఎల్‌డీఏ ఈవోగా నియమించారు. కాగా, పశుసంవర్ధక శాఖకు పశువుల మందులు సరఫరా చేసిన కంపెనీలకు పెండింగ్‌లో ఉన్న రూ.70 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి, మళ్లీ మందుల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని పాడి రైతులు, మేకలు, గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామకృష్ణ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి మంగళవారం వినతిపత్రం అందజేశారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

(5వ పేజీ తరువాయి)

కో-ఆప్షన్ సభ్యుడు గౌస్ అధికారులను ప్రశ్నించారు. నూతన పింఛన్ల మంజూరుకు సంబంధించి ఇంకా లాగిన్ ప్రభుత్వం ఇవ్వలేదని, డిసెంబరులో పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ఉంటుందని డీఆర్‌డీఏ అధికారులు వివరణ ఇచ్చారు. ఆయా మండలాల్లో నెలకొన్న సమస్యలు చెప్పుకునేందుకు అధికారులు స్థాయి సంఘాల సమావేశాల్లో అందుబాటులో ఉండటం లేదని పలువురు సభ్యులు జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలకు హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని జెడ్పీ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. డ్వాక్రా మహిళలకు సబ్సిడీపై రుణాలు ఇవ్వడం లేదని, బ్యాంకులకు డ్వాక్రా మహిళలు వెళితే వెలుగు కార్యాలయాలకు వెళ్లాలని చెబుతున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. డ్వాక్రా మహిళలు వివిధ వ్యాపారాలు చేసేందుకు పీఎంజీఎస్‌వై తదితర పథకాల ద్వారా 33శాతం రాయితీతో రుణాలు ఇప్పించాలని సభ్యులు అధికారులను కోరారు.

పంట నష్టం నమోదు సరిగా లేదు

మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట నష్టం వివరాలను సక్రమంగా నమోదు చేయడంలేదని సభ్యులు ఆరోపించారు. నేలవాలిన వరి పొలాలను మాత్రమే నమోదు చేస్తున్నారని, కంకులకు ఉన్న గింజలు పగిలిపోయి గింజలు పాలు పోసుకోలేదని, ఇలా నష్టపోయిన రైతులకు పంట నష్టం ఇవ్వాలని కోరారు. పంట నష్టం జరిగిన రైతులకు న్యాయం జరిగేలా జాబితాలను తయారు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్న వారి నుంచి ఆస్పత్రి యాజమాన్యాలు అధికంగా నగదు వసూలు చేస్తున్నాయని, ఇలాంటి ఆస్పత్రులపై నిఘా ఉంచి, తగు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఈ సమావేశాల్లో జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, జెడ్పీటీసీ సభ్యులు, ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనికిరాకుండా పోయిన మినుముపంటతో రైతులు



మినుము

మొంథా ఎఫెక్ట్..

విలవిల!

- అత్యధికంగా పంట నష్టపోయిన రైతులు
- బాపులపాడులో అత్యధికంగా 1500 ఎకరాల్లో నష్టం
- 5000 వేల ఎకరాల్లో తుడిచిపెట్టుకుపోయిన వరి
- ప్రభుత్వ ఆదుకోవాలంటూ రైతుల ఆవేదన

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్)

ఇటీవల మొంథా తుపాను దెబ్బకు ఉమ్మడి జిల్లాలో మినుము రైతులు భారీగా నష్టపోయారు. అత్యధికంగా బాపులపాడు మండలంలో 1500 ఎకరాల పంటను కోల్పోవాల్సి వచ్చింది. మెట్ట ప్రాంతాల్లో అత్యధికంగా సాగుచేసిన పంట తుడిచి పెట్టుకుపోయింది. మండల వ్యాప్తంగా కానుమోలు, ఆరుగొలను, తిప్పనగుంట, సిరివాడ, ఓగిరాల, దంటగుంట్ల, రంగయ్యప్పారావుపేట, కాకులపాడు, వైకుంఠలక్ష్మీపురం తదితర గ్రామాల్లోని 16వేల ఎకరాల్లో వరి సాగు చేస్తే ఐదువేల ఎకరాల్లోని పంట నేలవాలి పూర్తిగా దెబ్బతింది. కనీసం పశువుల మేతకు కూడా పనికిరాదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక మెట్టప్రాంతాలైన వీరవల్లి, రంగన్నగూడెం, సింగన్నగూడెం, వేలేరు, రేమల్లె, మల్లవల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో సాగుచేసిన మినుము(పీ31 విత్తన రకం), పెసర పంటల్లో అత్యధికంగా మినుము పంట 1500 ఎకరాలకు పైగా పూర్తిగా పనికిరాకుండాపోయింది. కుళ్లిపోయిన స్థితిలో గింజలు బయటపడటంతో రైతుల కంట కన్నీరు వస్తోంది. వేల రూపాయల పెట్టుబడితో సాగుచేసి మినుము చేతికి వచ్చే సమయంలో మొంథా



తుఫాను దెబ్బకు రైతులు కుదేలవుతున్నారు. ఎక్కువ మంది కౌలు రైతులవడంతో నష్టపరిహారం అందుతుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంట మొత్తం కాయదశలోనే కుళ్లిపోవడంతో తప్పని పరిస్థితుల్లో పలువురు రైతులు దున్నేసేందుకు సమాయత్తమవుతున్నారు. నష్టపరిహారం అంచనాలే తప్ప కౌలురైతులకు ఇంతవరకూ భరోసా కల్పించలేదని వాపోతున్నారు.



కాయలోనే కుళ్లిపోయి ఎండిన మినుము పంట

నష్టం అంచనాల్లో గందరగోళం

కొందరు రైతులు అటు మెట్ట ప్రాంతంలో ఉద్యాన పంటలు, ఇటు కాలువ కింద ప్రాంతంలో వరి సాగు చేస్తున్నారు. దీనికి తోడు పంటనష్టం నమోదు చేసుకుంటే మిగిలిన పంటను కొనుగోలు చేయరని ఆర్బీకే(రైతు సేవా కేంద్రాలు) సిబ్బంది చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నమోదు చేసుకోవాలో లేదో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నష్టపరిహారం అంచనాల్లో నింబధనలను కొంతమేర సడలించి ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది

\- సాంబశివరావు, సింగన్నగూడెం

కౌలుకు తీసుకుని ఎకరానికి రూ.50వేల పెట్టుబడితో మినుము పంట సాగు చేశాను. మొంథా తుఫాను దెబ్బకు మొత్తం నీటిపాలయింది. ప్రభుత్వం కనీసం రూ.30వేలు నష్టపరిహారం ఇస్తేనే మళ్లీ సాగు.. లేకుంటే పస్తులే.

పంట, గడ్డి కూడా పనికిరాకుండా పోయింది

\- బేతా శేషుకుమార్, ఆరుగొలను

తుపానుకు తోడు ఈదురుగాలులతో స్వర్ణరకం వరిపంట మొత్తం నేలవాలి కుళ్లిపోయింది. ఎకరానికి ఇప్పటివరకూ రూ.35వేలకు పైగా పెట్టుబడి పెట్టాం. పశువుల మేతకు కూడా గడ్డి పనికిరాకుండా పోయింది.

ప్రాణాలు తీసిన అతివేగం

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్నాడు. ప్రిన్స్‌బాబు విజయవాడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా చేస్తున్నాడు. రాకేష్, ప్రిన్స్ పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. రాకేష్, పాపారావు డిగ్రీ వరకు కలిసి చదువుకోవడంతో వారి మధ్య స్నేహం చిగురించింది. రాకేష్ తండ్రికి టాటా సఫారీ స్ట్రాం కారు ఉంది. ఈ ముగ్గురు యువకులు సోమవారం రాత్రి నగరంలో ఎంజాయ్ చేయాలని నిర్ణయించుకున్నారు. రాకేష్ ఇంట్లో చర్చికి వెళ్తానని చెప్పి బయటకు వచ్చాడు. ఇంటి నుంచి వచ్చేటప్పుడు తల్లిదండ్రులకు తెలియకుండా కారును తీసుకొచ్చాడు. రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ఈ ముగ్గురు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. పాపారావు కుటుంబం ఇంతకుముందు కంకిపాడు మండలం కుందేరు గ్రామంలో ఉండేది. తర్వాత ఉపాధి నిమిత్తం ఆ కుటుంబం విజయవాడలో గిరిపురానికి మారింది. రాత్రంతా కారులో తిరగాలని భావించిన ఈ ముగ్గురు యువకులు మచిలీపట్నం జాతీయ రహదారిని ఎంచుకున్నారు. విజయవాడ నుంచి నేరుగా కుందేరుకు వెళ్లి అక్కడ పాపారావు బంధువు కొణతం చింతయ్య(19)ను ఎక్కించుకున్నారు. అక్కడి నుంచి ఉయ్యూరు వైపునకు బయలుదేరారు. చింతయ్య గ్రామంలో పాడిరైతుగా ఉన్నాడు.

కారు ఇంట్లోనే ఉందనుకున్న తండ్రి..

అర్ధరాత్రి మూడు గంటల సమయంలో ఉయ్యూరు పోలీసులు రాకేష్ తండ్రి చక్రపాణికి ఫోన్ చేసి మాట్లాడే వరకు తన కారు ఎక్కడ ఉందో ఆయనకు తెలియలేదు. పోలీసులు చక్రపాణికి ఫోన్‌చేసి టాటా సఫారీ స్ట్రాం కారు మీదేనా అని అడిగారు. అప్పటికి ఆయనకు ఏం జరిగిందో తెలియలేదు. పోలీసులు రెండు మూడు సార్లు అడిగేసరికి కారు తన వద్దే



ఘటనా స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉందని చెప్పారు. ఈ కారుకు ప్రమాదం జరిగిందని పోలీసులు సమాచారం ఇచ్చిన తర్వాత ఆయన బయటకు వచ్చి చూసుకున్నారు. అక్కడ కారు కనిపించకపోవడంతో షాకయ్యారు. చర్చికి వెళ్తున్నానని చెప్పిన కుమారుడు రాకేష్ కారు తీసుకెళ్తున్నానన్న సమాచారాన్ని తల్లిదండ్రులకు తెలియజేయలేదు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న తర్వాత ఆయన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లారు. జరిగిన ప్రమాదాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. రాకేష్ నడిపిన వేగానికి టాటా సఫారీ కారు కాబట్టి ఆనవాళ్లు మిగిలాయని, అదే మరో కారు అయితే నామ రూపాలు ఉండేవి కావని స్థానికులు చెబుతున్నారు.



శోక సంద్రంలో కుటుంబాలు

మొగల్రాజపురం : గండిగుంట పెట్రోలు బంక్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన కారు ప్రమాదంలో మొగల్రాజపురం ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకుల మృతి స్థానికంగా విషాదం నింపింది. ముగ్గురు మిత్రులు కావడం ఆ కుటుంబాలను తీరని వేదనకు గురిచేసింది. రాకేష్ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా, పాపయ్య మెడికల్ ఫీల్డ్‌లో, ప్రిన్స్ రమేష్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. వీరంతా స్థానికంగా అందరికితో కలివిడిగా ఉండే వారు కావడంతో వీరి మరణ వార్త విని స్థానికులు ఆ కుటుంబాలను ఓదారుస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియల కార్యక్రమం పూర్తి చేశారు.

వ్యాన్ ఢీకొని వృద్ధురాలు మృతి

ఉంగుటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి చెన్నై-కోల్‌కతా జాతీయరహదారిపై ఆత్కూరు వద్ద జరిగింది. ఆత్కూరు ఎస్సై ఎస్.లక్ష్మీనరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కటికల జోజమ్మ(60)తన భర్త బాల ఏడేళ్ల క్రితం చనిపోవడంతో ఇద్దరు కుమారులతో కలిసి స్థానిక నయారా పెట్రోల్‌బంక్ సమీపంలోని నివాసముంటోంది. చిన్నకుమారుడు రాజేష్(34) లారీ క్లీనర్‌గా పనిచేస్తుండగా, పెద్దకుమారుడు విజయ్(36)దివ్యాంగుడు కావడంతో స్థానికంగా జాతీయరహదారి అవతల వున్న ఓ కిరాణాషాపులో పనిచేస్తున్నాడు. ఈక్రమంలో విజయ్ కోసం సోమవారం రాత్రి సుమారు 7గంటల సమయంలో జోజమ్మ రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి ఏలూరువైపు వేగంగా వెళుతున్న టాటాఏస్ వ్యాన్ ఢీకొట్టింది. తీవ్రగాయాలైన జోజమ్మను 108అంబులెన్స్‌లో గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారకుడైన వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని..

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆరుగొలను వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరుగొలనుకు చెందిన ఈడ్పుగంటి బాలరాజు(74) పొలానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన మరో వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేష్ తెలిపారు.



ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న జంక్షన్ ఎస్సై సురేష్

మెగా పరిణామం!

(5వ పేజీ తరువాయి)

సానుకూలంగా స్పందించి ప్రతిపాదనలు పంపించాలని సూచించడంతో ఎన్టీఆర్ జిల్లా అధికారులు గ్రేటర్ ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టారు. గతంలో 45 గ్రామాలను గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలో చేర్చగా.. ఈ దఫా 75 గ్రామాలను జాబితాలో చేర్చారు.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎంపీ చిన్ని

విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని గ్రేటర్ అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ స్థాయిలోనూ చొరవ చూపించారు. నగర, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో త్వరలో సమావేశం నిర్వహించనున్నారు. గ్రేటర్‌లో చేర్చే అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానున్నాయి. మంత్రుల బృందం తుది నివేదిక సమర్పించగానే.. ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇదే సందర్భంలో విజయవాడ గ్రేటర్ అంశం కూడా చర్చకు రానుండటంతో .. ఇప్పటి వరకు ఉన్న గందరగోళానికి తెర పడే అవకాశం ఉంది.

పెనమలూరు గ్రేటర్ విలీన గ్రామాల సంగతేమిటి?

విజయవాడను ఆనుకుని ఉన్న పెనమలూరు నియోజకవర్గాన్ని వైసీపీ ప్రభుత్వం కృష్ణాజిల్లాలో కలిపింది. దీనిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తారని నియోజకవర్గ ప్రజలు ఆశతో ఉన్నారు. పెనమలూరు, కంకిపాడు మండలాల పరిధిలోని గ్రామాలను తాజాగా గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనల్లో చేర్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 12 గ్రామాలను ప్రతిపాదించటం జరిగింది. రెండు మండలాలలో కానూరు. పోరంకి, తాడిగడప, యనమలకుదురు, పెనమలూరు, గంగూరు, గోశాల, ఈడుపుగల్లు, పునాదిపాడు, కంకిపాడు, వేల్పూరు, ఉప్పులూరు గ్రామాలను అప్పట్లో గ్రేటర్ విజయవాడలోకి ప్రతిపాదించారు. ప్రస్తుతం మరో ఏడు గ్రామాలను అదనంగా కలిపి 20 గ్రామాలను ప్రతిపాదించినట్టు తెలుస్తోంది.

ఎన్టీఆర్ జిల్లాలోకి తీసుకొస్తేనే విలీనానికి అవకాశం

పెనమలూరు నియోజకవర్గాన్ని కృష్ణాజిల్లాలో ఉంచే క్రమంలో అయితే.. గ్రేటర్ విజయవాడ పరిధిలోకి ఈ రెండు మండలాల గ్రామాలు వచ్చే అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాలు, రెండు డివిజన్ల గందరగోళం లేకుండా చేయటానికి ఒక నియోజకవర్గం.. ఒకే రెవెన్యూ డివిజన్ అన్న విధానాన్ని తీసుకోవటం వల్ల.. పెనమలూరు నియోజకవర్గాన్ని కృష్ణాజిల్లాలో ఉంచి కీలకమైన పెనమలూరు, కంకిపాడు మండలాలను విజయవాడ గ్రేటర్‌లో కలపటమన్నది సాధ్యం కాదు. పెనమలూరు నియోజకర్గ ప్రజలు గ్రేటర్ విజయవాడను అప్పుడూ, ఇప్పుడూ స్వాగతిస్తున్నారు. నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలోకి తీసుకురాకుండా గ్రేటర్ విజయవాడలో విలీనం చేయటానికి అవకాశం ఉండదు. పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపే అంశంపై స్థానిక శాసన సభ్యుడు సుముఖంగా లేరని తెలుస్తోంది. నియోజకవర్గాన్ని విలీనం చేయటానికి ఒప్పుకోని ఎమ్మెల్యే గ్రేటర్‌కైనా ఒప్పుకుంటారా అన్నది అనుమానంగానే ఉంది. నియోజకవర్గ ప్రజల అభీష్టానికి భిన్నంగా శాసన సభ్యుడి తీరు ఉండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



రెవెన్యూ ఉద్యోగుల సంఘ నేతలకు కప్పు అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

క్రీడల్లో సత్తాచాటిన కృష్ణాజిల్లా రెవెన్యూ ఉద్యోగులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయిలో ఈనెల 7, 8, 9 తేదీల్లో అనంతపురంలో జరిగిన రెవెన్యూ క్రీడల్లో కృష్ణాజిల్లా క్రికెట్ జట్టు ద్వితీయ బహుమతి సాధించింది. జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సీహెచ్ వీరాంజనేయప్రసాద్, కార్యదర్శి ఎంవీ శ్యామ్‌నాథ్ గౌడ్ ఆధ్వర్యంలో 40 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. క్రికెట్, మహిళల షాట్‌పుట్‌లో ద్వితీయస్థానంలో నిలిచారు. కలెక్టర్ కార్యాలయంలో విజేతలను కలెక్టర్ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులు మానసిక ఉల్లాసానికి ఆటలు అవసరమన్నారు.

రైతు కష్టం దోపిడీ!

- పత్తి రైతును ఆదుకోని కొనుగోలు కేంద్రాలు
- దళారులను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు
- నిబంధనలు సడలించి ఆదుకోవాలంటూ ఆవేదన



పండిన కొద్ది పాటి పత్తిని బోరాలలో నింపుతున్న రైతు

నందిగామ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : దళారుల దోపిడీ, మార్కెట్ మాయాజాలం నుంచి అన్నదాతను ఆదుకొనే లక్ష్యంతో ఏర్పడిన సీసీఐ లక్ష్యాలను పక్కన పెట్టి వ్యాపార ధోరణితో కొనుగోలు చేపడుతోంది. వ్యాపార దృక్పధంతో సీసీఐ ఏర్పాటు చేసుకున్న నిబంధనలతో పాటు బయ్యర్లు, మార్కెటింగ్ సిబ్బంది స్వార్థపూరిత చర్యలతో పత్తి రైతు చిత్తవుతున్నాడు. సీసీఐ కేంద్రాలకు వెళ్లడం కంటే గ్రామాల్లో దళారులను ఆశ్రయించడమే మేలు అన్న స్థితికి పత్తి రైతులను కృంగదీస్తున్నారు. కొన్నేళ్లుగా సీసీఐ కేంద్రాలకు రైతులు వెళ్లడం మానేశారు. కేవలం దళారులే అక్కడకు పత్తిని తీసుకువెళుతున్నారు. ఒక వేళ ఎవరైనా రైతులు ఆశతో పత్తిని తీసుకువెళ్లినా బయ్యర్లు ఆ పత్తిని కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారు. పాలకుల పర్యవేక్షణా లేమి, రైతుల నిస్సహాయతను ఆసరా చేసుకొని బయ్యర్లు, సీసీఐ సిబ్బంది దోపిడీ చేస్తున్నారు.

మొంథా తుపాను ప్రభావంతో గతంలో ఎన్నడూలేని విధంగా పత్తి రైతులు దెబ్బతిన్నారు. దిగుబడి పడిపోయి నాణ్యత కూడా తగ్గింది. ఈ తరుణంలో అన్నదాతకు అండగా ఉండాల్సిన సీసీఐ మొఖం చాటేస్తున్నది. పత్తి రైతుల దీనస్థితిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి సీసీఐ కేంద్రాలను ప్రారంభింపజేసింది. రైతుల వద్ద ఉన్న పత్తిని నాణ్యతతో సంబంధం లేకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని కోరింది. అధిక వర్షపాతంతో పత్తిలో తేమ ఉన్నందున సీసీఐ నిబంధనలను సడలించి పత్తి రైతును ఆదుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖరాసింది. రైతులకు ధైర్యం కల్పించేందుకుగాను మార్కెట్ యార్డులలో సీసీఐ కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించింది. ఆమేర సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదు. ప్రారంభించిన రోజు మినహా ఇంతవరకూ ఒక్క కిలో పత్తి కొనలేదు. సీసీఐ కేంద్రాలలో పత్తి కొనుగోళ్లు జరిపితే రైతులు నేరుగా తమ పత్తిని అక్కడ అమ్ముకోగలుగుతారు. కేంద్రాలలో కొనుగోలు చేసిన పత్తిని మిల్లులకు తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు టెండర్లు పూర్తి కాలేదన్న నెపంతో బయ్యర్లు అక్కడ కొనుగోళ్లు జరపడం లేదు. నందిగామ, కంచికచర్ల సీసీఐ కేంద్రాలకు గుంటూరు మిల్లులకు జత చేశారు. ట్రాన్స్‌పోర్టు టెండర్లు పూర్తి కానందున రైతులు తమ పత్తిని నేరుగా గుంటూరులోని మిల్లులకు తరలించాలని సూచిస్తున్నారు. సన్న చిన్న కారు రైతులు తమ వద్ద ఉన్న పత్తిని గుంటూరు తీసుకువెళ్లలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. సీసీఐ మద్దతు ధర 8110 రూపాయలు ఉండగా దళారులు 45 వందల నుండి ఐదు వేల రూపాయల వరకూ మాత్రమే చెల్లిస్తూ పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. అదికూడా నాణ్యమైన పత్తిని మాత్రమే ఆ ధరకు కొంటున్నారు. మసర ఉన్న పత్తిని, కాయలు ఉన్న పత్తిని మరీ తక్కువ ధరకు అడుగుతున్నారు. కేవలం పత్తి తీతలకే క్వింటాకు 25 వందల వరకూ ఖర్చు చేసిన అన్నదాతలు ఆదరకు పత్తిని అమ్మలేక మౌనంగా రోదిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సీసీఐ నేడు బయ్యర్లు, దళారుల పరమైందని చెప్పాలి. గుంటూరు మిల్లులకు దళారులు తీసుకువెళ్లిన పత్తికి అధిక ధర అందిస్తూ దొడ్డి దారిన వారి వద్ద నుండి సీసీఐ అధికారులు లబ్ధి పొందుతున్నారు. ఆరుగాలం శ్రమించిన అన్నదాత కష్టాన్ని ఆఖరి క్షణంలో పంచుకుంటూ వారు లబ్ధి పొందుతున్నారు. మరోవైపు గుంటూరు చేరిన పత్తికి చెల్లించాల్సిన రవాణా కిరాయిలను కూడా సీసీఐ సిబ్బంది లెక్క రాసుకొని జేబుల్లో వేసుకుంటున్నారు. అదే రైతుల వద్ద కొంటే కిరాయి సొమ్ము మిగుల్చుకొనే వీలు లేనందున సీసీఐ అధికారులు దళారులను ప్రోత్సహిస్తున్నారు. పత్తి కొనుగోళ్లు చేపట్టాలని నెల రోజుల క్రితమే నిర్ణయించిన సీసీఐ ట్రాన్స్‌పోర్టు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయకపోవడం దారుణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిల్లుల వద్ద పత్తి కొనుగోళ్లు నిలిపివేసి పూర్తి పత్తిని సీసీఐ కేంద్రాల వద్దనే చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేర నిబంధనలు సడలించి పూర్తి పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



తేమ శాతం తగ్గించేందుకు ఆరబోసిన పత్తి

గన్నీ బ్యాగ్‌ల సొమ్ము గోల్‌మాల్..

కొనుగోలు కేంద్రాలలో రైతులు తీసుకువచ్చిన పత్తికి ధర ఇవ్వడంతో పాటు పత్తి బోరాలకు సంబంధించి 30 రూపాయల చొప్పున సీసీఐ చెల్లించాల్సి ఉంది. తొలి రోజుల్లో అలా చెల్లించినా.. రాను రాను రైతులు తగ్గి దళారుల సంఖ్య పెరగడంతో సీసీఐ అధికారులు బోరాల సొమ్ము ఇవ్వడం మానేశారు. దళారులు ఆమేర సొమ్మును రైతు నుండి దోచుకోవడం ప్రారంభించారు. మొత్తం మీద సీసీఐ కేంద్రాలు దళారులకు, సీసీఐ అధికారులకు స్వర్గధామంలా మారాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆపదలో ఉన్న పత్తి రైతును ఆదుకోవాల్సి ఉంది. స్థానికంగా కొనుగోళ్లు చేపట్టి సీసీఐ ఫలాలు నేరుగా రైతులకు అందేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

శివాలయంలో ఘనంగా శాంతి కల్యాణం



హనుమాన్‌జంక్షన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపులపాడు మల్లికార్జునస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి శివపార్వతుల శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా పర్యవేక్షణలో వేదపండితులు కోసూరి మురళీ కృష్ణమాచార్యులు, బుచ్చి రామశర్మ, ఆలయ అర్చకులు సామవేదం మారుతిశర్మలు కల్యాణాన్ని జరిపారు. మంగళవారం కల్యాణ దేవతా మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డుపైనే ఆటోలు!

- వీరమ్మ తల్లి ఇంటివీధిలో ట్రాఫిక్‌కు అంతరాయం
- పట్టించుకోని పోలీసులు
- ఇబ్బంది పడుతున్న వీరమ్మ భక్తులు



ఉయ్యూరు వీరమ్మతల్లి ఇంటివీధిలో రోడ్డుకు అడ్డుగా నిలిపిన ఆటోలు

ఉయ్యూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వీరమ్మ తల్లి ఇంటివీధిలో 9వ వార్డు సచివాలయం సమీపాన రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలుపుతున్న ఆటోలతో అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులు, సచివాలయానికి వచ్చే వారికి అసౌకర్యం కలుగుతుంది. పాత స్టేట్‌బ్యాంక్ రోడ్డు నుంచి వీరమ్మ ఆలయానికి, షెరీ మసీదుకు, మేదర బజారు మీదుగా శివాలయం రోడ్డుకు వెళ్లేవారితో అనునిత్యం రద్దీగా ఉండు ఈ రోడ్డు పొడవునా మూడు, నాలుగు వరుసల్లో ఆటోలు నిలిపి తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ఎదురు చూడటంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. రాష్ట్రంలో పలు ప్రదేశాల నుంచి వీరమ్మ ఆలయానికి ప్రతి రోజూ కార్లు, ఆటోలు, ఇతర వాహనాల్లో భక్తులు వచ్చి వెళుతుంటారు. అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డు మలుపువద్ద ఆటోలు నిలపడంతో భక్తులు నడిచి వెళ్లడానికి కూడా వీలు లేక ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నప్పటికి పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అనధికార నిర్మాణం కూల్చివేత

పెనమలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలోని కానూరు మురళీనగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాన్ని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. మునిసిపల్ పరిధిలో అనధికార నిర్మాణాలను సహించేది లేదని, బిల్డర్లు సహకరించాలని, లేని పక్షంలో బిల్డర్లను బ్లాక్ లిస్టులో పెడతామని కమిషనర్ షేక్ నజీర్ హెచ్చరించారు.

తల్లిదండ్రులు పిల్లలకు మంచి విలువలు నేర్పాలి

- సేఫ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి స్వరూపరాణి

కానూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విలువలను నేర్పాలని సేఫ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి కె. స్వరూపరాణి విజ్ఞప్తి చేశారు. జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం కానూరులోని సిద్ధార్థ బీఈడీ కళాశాలలో జరిగిన చర్చాగోష్ఠిలో ఈమె పాల్గొని ప్రసంగించారు. నేడు చిన్నపిల్లలు కూడా డ్రగ్స్ బారిన పడుతున్నారని, పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతిక యుగంతో స్త్రీలకు చదువు ఉన్నా నేటికినీ పలుచోట్ల వివక్షకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చర్చా కార్యక్రమంలో కళాశాలకు చెందిన పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులకు దోమల తెరలు అందజేసిన మానవత ప్రతినిధులు

దోమ తెరలు అందజేత

గన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావాజీగూడెం బాలికల వసతి గృహ విద్యార్థినులకు దోమ తెరలు, మూడు కూలింగ్ వాటర్ టిన్‌లు, 6 ఆల్‌అవుట్ మిషన్‌లు, 6 రీఫిల్స్ మంగళవారం మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ కర్రా వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలకృష్ణమూర్తి, ప్రసాదరావు, వెంకట్రావు, కృష్ణమోహన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామి ప్రత్యేక పూజలో భక్తులు

వైభవంగా వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకులపాడులోని వీరభద్రస్వామి దేవాలయ వార్షిక మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుఝామున స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. కమిటీ సభ్యులు వీరపనేని రాజేశ్వరరావు, చలసాని శ్రీనివాస్, శ్రీహరిరావు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డ్రెయిన్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

కంకిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. కంకిపాడు గన్నవరం రోడ్డులో నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, కంకిపాడులోని విష్ణాలయం వీధి, గన్నవరం రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణ పనులకు సుమారు రూ. 13 లక్షలు కేటాయించటం జరిగిందన్నారు. డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. గ్రామంలో మరి కొన్ని చోట్ల డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరముందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ అసిస్టెంట్ ఇంజినీర్ మణికంఠ, టీడీపీ క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



డ్రెయిన్ అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఏఈ వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

కార్పొరేట్ కంపెనీ దివీస్‌ను కోరిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

కంకిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కార్పొరేట్ కంపెనీలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరారు. పునాదిపాడులో శిథిలావస్థకు చేరిన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 10వ తేదీన పునాదిపాడు జగజ్జీవన్ రామ్ కాలనీ వాసులు తనను కలిసి కమ్యూనిటీ హాల్ కేటాయిం చాలంటూ తనను కోరడం జరిగిందన్నారు. అందులో భాగంగా నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహాన్ని మంగళవారం పరిశీలించామన్నారు. అయితే వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో భవనం కమ్యూనిటీ హాల్‌గా ఉపయోగించుకునేందుకు వీలుగా లేదన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ స్థానంలో కొత్తభవనం నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. అదే విధంగా దివీస్ ల్యాబరేటరీస్ సంస్థతో మాట్లాడటం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. దివీస్ యాజమాన్యం అందుకు సానుకూలంగా స్పందించారని తెలియజేశారు. రానున్న రోజుల్లో దివీస్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు కార్యదర్శి మద్దాలి సాయిబాబు, పార్టీ మండల అధ్యక్షులు జంపని వెంకటేశ్వ రరావు, కంకిపాడు క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కాసరనేని కరుణ, మోహన్‌కృష్ణ, కర్రా కిషోర్, ముసిబోయిన బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిబాబు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

గన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం నేరమని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిబాబు అన్నారు. స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో పలు బృందాలతో 3,062 సర్వీసులు పరిశీలించి, 81 కేసులు నమోదు చేసి, రూ.4,40 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులు వాలంటరీ అడిషనల్ లోడ్ స్కీం 50శాతం వినియోగించుకోవాలని వివరించారు. అలాగే సర్వీసులను అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరి కింద వాడితే కేసులు, జరిమానా తప్పవన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ డిప్యూటీ ఇంజనీర్ పి.నాగేశ్వరరావు, ఇ.రామ్మూర్తి, గన్నవరం ఏఈ ఎం.వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం ట్రస్ట్‌కు రూ. 3.50 లక్షల విరాళం



హనుమాన్‌జంక్షన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజ నేయస్వామి దేవస్థానంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్ర మానికి నూజివీడుకు చెందిన పీవీఎస్ ఎస్ రాంప్రసాద్ తేజశ్రీ దంపతులు మంగళవారం రూ. 3.50 లక్షలు విరాళం అందజేశారు. దేవస్థానం పాలక మండలి చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు దేవస్థానానికి విరాళం అందించారు. ఆలయ అర్చకులు మారేపల్లి సీతారా మానుజాచార్యులు దాతలు పేరిట అర్చనలు జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థానం ఈవో పి.తారకేశ్వరరావు స్వామివారి శేష వస్త్రంతో దాత లను సత్కరించి చిత్రపటాన్ని బహుకరించారు. విజయవాడకు చెందిన పట్నాల ప్రసన్నకుమార్, వినీల దంపతులు వితరణతో 350 మందికి అన్న సంతర్పణ చేసినట్లు ఈవో తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

గన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు జనవిజ్ఞాన వేదిక ఎంతో కృషి చేస్తుందని బాలోత్సవ్ కమిటీ అధ్యక్షులు గన్నె వెంకట్రావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన ఎన్‌ఎంఎంఎస్ పార్ట్-1 పుస్తకాలను మంగళవారం పలు హైస్కూళ్లలో అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్‌కు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్, బాలోత్సవ్ కమిటీ కార్యదర్శి కర్ర వరప్రసాద్ యూటీఎఫ్ అధ్యక్షుడు జీవి రవిబాబు, సీహెచ్ రత్నకుమారి, కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ గౌరవ సలహాదారుడిగా నూకల



నూకల సాంబశివరావు

ఉయ్యూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా సుధీర్ టింబర్‌డిపో అధినేత నూకల సాంబశివరావు నియమితులయ్యారు. ఆర్యవైశ్య సామాజిక వర్గ అభ్యున్నతికి అంతర్జాతీయస్థాయిలో పనిచేస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థకు రాష్ట్ర గౌరవ సలహాదారుగా సాంబశివరావును ఎంపిక చేసినట్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు నియమామకపత్రం మంగళవారం పంపించారు. సాంబశివరావు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని గౌరవ సలహాదారుగా నియమిస్తున్నట్టు పేర్కొన్నారు.

35వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా

తహసీల్దార్ సురేశ్ కుమార్

ఉయ్యూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో షుమారు 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనాగా తహసీల్దార్ సురేశ్ కుమార్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, గత సంవత్సరం 28,500 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి అయిందని, ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు పది కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గత రెండు రోజులుగా పెదఓగిరాల, ముదునూరు, కలవపాముల గ్రామాల్లో రైతుల నుంచి 30 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు పంపినట్టు తెలిపారు. వరిపంట కోతకోసే ముందు రైతులు గ్రామంలో వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలకు సమాచారం అందిస్తే తగినట్టు షెడ్యూల్ తయారు చేసి ఎ వరికి ఇబ్బంది లేకుండా చూస్తారన్నారు. రైతులు సహకరించి పంట ఎప్పుడు కోస్తారో గ్రామంలో వ్యవసాయ సహాయకులకు తెలియపరచాలని పేర్కొన్నారు.



విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ సభ్యులు

సిద్ధార్థ వర్సిటీలో జాతీయ విద్యా దినోత్సవం

కానూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత తొలి విద్యామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను స్మరించుకున్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ జె. శివరాంప్రసాద్, డాక్టర్ ఎ. వేణుగోపాల్ రెడ్డి, ఐఐసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. కార్తీక్ పాల్గొని ప్రసంగిస్తూ ఈదినోత్సవం ద్వారా విద్యార్థులు నిరంతరం నేర్చుకోవడం, సృజనాత్మకత, నైతిక విలువలు, సమాజ సేవ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. పోటీల్లో వి. అవినాష్, కె. వంశీ ప్రథమ బహుమతిని, పి. పర్ణశ్రీ, వి. మనస్విని ద్వితీయ బహుమతులను సాధించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

పెనమలూరు : స్వాతంత్ర్య సమరయోధుడు, స్వతంత్ర భారత తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతీయ విద్యారంగాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దిన ఆజాద్ సేవలను ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, అన్నే ధనయ్య, షేక్ బుజ్జి, ఇమాం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పుల వల్ల ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహనతో ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని డాక్టర్ కిరణ్మయి సూచించారు. వీరవల్లి పీహెచ్‌సీ పరిధిలోని నారాయణపురం గ్రామంలో మంగళవారం హెల్త్‌డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యస్థితి గురించి వాకబు చేశారు. జ్వరాల బారిన పడిన వారు తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జ్వరం వచ్చినట్లు ఉంటే ఏఎన్ఎం, ఆశావర్కర్లకు సమాచారమివ్వాలని తెలిపారు. జ్వరం లాంటివి ఎక్కువగా నమోదైతే తక్షణం పీహెచ్‌సీలో వైద్య చికిత్స చేయించుకోవాలని, అవసరమైతే ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి నాగలక్ష్మి, ఏఎన్ఎం సునీత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



నారాయణపురంలో హెల్త్‌డ్రైవ్ నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్మయి, సిబ్బంది



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు మంగళగిరికి తరలి వెళ్తున్న మల్లవల్లి పారిశ్రామికవాడ భూనిర్వాసిత రైతులు

నష్టపరిహారం అందించాలి

మంగళగిరి తరలిన మల్లవల్లి భూ నిర్వాసిత రైతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికాభివృద్ధికి సాగు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మల్లవల్లి భూ నిర్వాసిత రైతులు ప్రభుత్వాన్ని కోరారు. మల్లవల్లి పారిశ్రామికవాడకు భూములిచ్చిన రైతులు మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి సమస్యను విన్నవించేందుకు మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయానికి తరలివెళ్లారు. నష్టపరిహారం అందక మనోవేదనతో ఇప్పటికే కుటుంబాల్లోని కొందరు పెద్దలు అనారోగ్యాల పాలయ్యారని, తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వానికి తమగోడు తెలిపేందుకు డిప్యూటీ సీఎంను కలిసేందుకు వెలుతున్నామని మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసం రామకృష్ణ, అకిలిశెట్టి బుజ్జి, ముక్కు శేఖర్, గోగినేని సావిత్రి, దోనేపూడి పద్మ, తదితర రైతులు పాల్గొన్నారు.



సాగరతీరానికి పర్యాటకులు వెళ్లకుండా మూసిన గేట్లు

సాగరతీరాన పర్యాటకులకు ఇక్కట్లు !

కోడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హంసలదీవి సాగర తీరంలో కార్తీక స్నానాలు ఆచరించేందుకు వచ్చిన పర్యాటకులకు ఇక్కట్లు తప్పటం లేదు. అటవీశాఖ అధికారులు పాలకాయితిప్ప కరకట్ట వద్ద గేటు ఏర్పాటు చేసి రాకపోకలపై నియంత్రణ ఏర్పాటు చేశారు. ఉదయం 7.30 గంటలకు గేటు తెరిచి సాయంత్రం 5గంటలకు మూసేస్తున్నారు. అయితే కార్తీకమాసంలో సూర్యోదయ పుణ్యస్నానం చేస్తే ముక్తి లభిస్తుందనే ఆశతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉదయం 6 గంటలకే కరకట్ట గేటు వద్దకు చేరుకున్నారు. ఉదయం వేళ స్నానాలకు అనుమతి లేదని అటవీశాఖ అధికారులు వీరందరినీ పాలకాయితిప్ప బీచ్ వద్దకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. అటవీశాఖ తీరుతో సాగరతీరం విశిష్టత దెబ్బతింటుందని, కార్తీక మాసంలో అయినా అధికారులు నిబంధనలు సడలింపు ఇచ్చి ఉదయం 6 గంటలకే గేట్లు తెరవాలని పర్యాటకులు కోరుతున్నారు.

పీఏసీఎస్‌ల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో 287 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని జిల్లా సహకార శాఖాధికారి కే చంద్రశేఖరరెడ్డి తెలిపారు. జాయింట్ కలెక్టర్ నవీన్, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి టీ శివరామకృష్ణప్రసాద్ ముమ్మరంగా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఆర్ఎస్‌కేల్లో ధాన్యం కొనుగోలుకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. 176 వ్యవసాయ పరపతి సంఘాలు 520 మంది పనిచేస్తున్నట్టు తెలిపారు. ఆర్ఎస్‌కేల్లో టెక్నికల్ అసిస్టెంట్, హెల్పర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తున్నట్టు సివిల్ సప్లయిస్ అధికారి టీ శివరామకృష్ణప్రసాద్ తెలిపారు. రైతుల ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి మిల్లులకు పంపుతున్నట్టు తెలిపారు.



స్వామి చిత్రపటాన్ని ఐఏఎస్ అధికారికి అందిస్తున్న పర్యవేక్షకుడు మధుసూదన రావు

సుబ్బారాయుడి సన్నిధిలో ఐఏఎస్ అధికారి

మోపిదేవి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాన్ని రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య శాఖ సంచాలకులు కేవీఎస్ చక్రధర్ బాబు దంపతులు మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి, స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందించారు.

ఆజాద్ సేవలు మరువలేనివి

● కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కూన రాంజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన కృషి మరువలేనిదని కృష్ణ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కూన రాంజీ అన్నారు. అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను కృష్ణ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి వీసీ కూన రాంజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ డీకే బాలాజీ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఉష, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కృష్ణా వర్సిటీలో జరిగిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కేయూ వీసీ కూన రాంజీ, కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

విద్యతోనే సమాజాభివృద్ధి: జేసీ నవీన్

ప్రముఖ విద్యావేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు, భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ అన్నారు. రాజుపేట షాదీఖానాలో ఆజాద్ జయంతిని జాతీయ విద్యాదినోత్సవంగా ప్రభుత్వపక్షాన నిర్వహించారు. జేసీ నవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ రంగాల్లోని మైనార్టీ ప్రముఖులను సత్కరించారు. అనంతరం జరిగిన సభలో నవీన్ మాట్లాడుతూ మైనార్టీలు ఉన్నత చదువులు చదువుకుని జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. టీడీపీ రాష్ట్ర నేత కొనకళ్ల బుల్లయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఉత్తర భారతదేశంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్, దక్షిణ భారత దేశంలో టంగుటూరు ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభిసీతారామయ్య వంటి ప్రముఖులు పాల్గొని తమ జీవితాలను అంకితం చేశారన్నారు. మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీంబేగ్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి రూ.170 కోట్లు మంజూరు చేసిందన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మైనార్టీ నేతలు ఖాజా, అజీమ్, ఎండీ ఇలియాస్ బాషా, జనసేన నేత గడ్డం రాజు పాల్గొన్నారు.

విలువలతో కూడిన రాజకీయాలే శాశ్వతం

● ఆర్టీసీ చైర్మన్, టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బండి రామకృష్ణ, కొనకళ్ల, బుద్ధప్రసాద్

నాగాయలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన రాజకీయాలే ప్రజల గుండెల్లో శాశ్వతంగా ఉంటాయని దానికి ఉదాహరణ దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంత్యుత్సవాలేనని ఆర్టీసీ చైర్మన్, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. ఎంవీకే శత జయంత్యుత్సవాలు నాగాయలంకలో జరుగుతున్నాయి. మంగళవారం వంద రోజులు పూర్తైన సందర్భంగా నాగాయలంక, భావదేవరపల్లి, తలగడదీవి, బర్రంకుల గ్రామాల్లో మండలి కృష్ణారావు విగ్రహాల వద్ద పలు కార్యక్రమాలు జరిగాయి. బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మార్క్‌ఫెడ్ చైర్మన్ బండి రామకృష్ణ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఎంవీకే ప్రజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, భాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని సేవలు చేశారన్నారు. రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార భాషా సంఘానికి ఆయన పేరును పెట్టడం ఎంతో గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఎంవీకే శత జయంత్యుత్సవాలను నాగాయలంక మండలంలో జరపటం, ఈ సందర్భంగా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయటాన్ని నిర్వహణ కమిటీని అభినందించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మెండు లక్ష్మణరావు, తలశిల స్వర్ణలత, మండవ బాలవర్ధిరావు, మండలి వెంకట్రామ్, గోపాలం వెంకటేశ్వరరావు, శ్రీనివాస చందు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, తోట రత్నారావుతోపాటు కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రేపల్లె సంజీవని, స్పెషల్ హాస్పిటల్ వైద్యులు సీదా చైతన్య సాయి దుర్గ, చలపతి, యు ప్రభుదాస్ వందలాది మందిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. 100 మంది యానాదులకు వస్త్రదానం, వేలాది మందికి అన్నదానం జరిగింది. తోట శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు నరసింహారావు

17న దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను

జయప్రదం చేయండి

చల్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరుగనున్న దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, కృష్ణాజిల్లా ఇన్‌చార్జి జలదంకి నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం చల్లపల్లి మండలం రామానగరంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై జరిగిన దాడిగా గుర్తించాలన్నారు. అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగితే ఇప్పటివరకూ దాడిచేసిన వ్యక్తిని అరెస్టు చేయకపోవటం బాధాకరమనీ, దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి సుమోటోగా కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నవంబరు 17న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గం నుంచి దళితసంఘాల నేతలు, కార్యకర్తలు ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లానేత కొక్కిలిగడ్డ నవీన్, కొడాలి ఏలియా, కొక్కిలిగడ్డ అనిల్, కొల్లూరి కుట్టి, రవీంద్ర, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



పశువైద్యాధికారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

పశుసంవర్ధక శాఖ అధికారుల సేవలు అభినందనీయం

అవనిగడ్డ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానులో పశుసంవర్ధకశాఖ అధికారుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మొంథా తుఫాన్‌లో ఉత్తమ సేవలందించిన పశువైద్యులు, సిబ్బందిని సత్కరించి, మొంథా యోధ అవార్డులు అందజేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సీహెచ్ నరసింహులు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగభూషణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సాంబశివరావు, వైద్యులు పాల్గొన్నారు.


పెడనలో ముగ్గురు బాలికలు అదృశ్యం

పెడన, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగపతి సినిమా హాలు ప్రాంతంలో మర్కజ్ దారుల్ బీర్ పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు అదృశ్యమయ్యారు. ఈ బాలికలు పాఠశాల హాస్టల్‌లో ఉంటూ పాఠశాలలో చదువుకుంటున్నారు. కాగా ఈ ముగ్గురు బాలికలు సోమవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయారు. దీంతో బాలికల అదృశ్యంపై పాఠశాల ప్రిన్సిపాల్ షరీఫ్ అహమ్మద్ మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న సీఐ కే నాగేంద్రప్రసాద్, ఎస్ఐ జీ సత్యనారాయణ పాఠశాలకు వెళ్లి విచారించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఫిర్యాదు ఆధారంగా బాలికల అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన బాలికల్లో ఒకరిది కాకినాడ కాగా, మరొకరిది విజయవాడ. ఇంకొకరిది బంటుమిల్లి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు

అనూ ఇమ్మాన్యుయేల్



'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.



భారీ యాక్షన్ డ్రాప్‌లో


కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్'(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్‌స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పామర్రు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉండ్రపూడి- పోలవరం అడ్డరోడ్డు వద్దగల వీరాంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం వేకువజాము నుంచే అయ్యప్ప, దుర్గామాతదీక్షాపరులు స్వామిని దర్శించుకుని విశేష ఆకుపూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపారాధనలు చేశారు. పాల పొంగళ్లను సమర్పించి తమ భక్తిభావాలను చాటుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకార్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ తాడిశెట్టి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం శేషాచార్యులు, భోతనబొట్ల సుబ్బారావు, ఫణి శర్మ, శర్మ, రామారావులు పూజాధికాలు జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాధికారి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ నిపుణుడు సీతారామిరెడ్డి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కూచిపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ప్రకృతి వ్యవసాయ నిపుణులు పేకేటి సీతారామిరెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ విధానంపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులకు కాజ గ్రామంలోని మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి నుంచి లభించే గో వ్యర్థాలతో కషాయాల తయారీ, చీడపీడల నివారణ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడుల సాధన మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే కషాయాల తయారీ విధానాన్ని స్వయంగా కలసి విద్యార్థులకు చూపించారు.అమూల్య, హర్షిత, గీతాశ్రీ, హేమలత, అనిత, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా యూనియన్ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం

గుడివాడ: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా 107వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక బ్యాంకు గుడివాడ శాఖలో మేనేజర్ మూడెడ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, బీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, భావన బయోటెక్ అధినేత ఆలమూరి మురళీకృష్ణ, రైట్‌సెట్ ఇండస్ట్రీస్ ప్రొపరెటర్ చలసాని స్పందన, డిప్యూటీ మేనేజర్ అశోక్, సీఎస్ఏ సుధాకర్, సౌమ్య, మార్కెటింగ్ ఆఫీసర్ ప్రకాష్ పాల్గొన్నారు.

కొండాలమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించేందుకు గాను రూ. 10,000లు విరాళంగా వేలూరి వెంకట శివలలిత మనోగ్న పరమేశ్వరిలు మంగళవారం ఆలయ కార్యాలయంలో చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ఆకుల కొండలరావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్ఫూర్తి అబుల్ కలాం ఆజాద్

● ఎంపీడీవో డీవై.విష్ణుప్రసాద్



మల్లాయిపాలెం ఉర్దూ పాఠశాలలో ..

గుడివాడ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి అబుల్ కలాం ఆజాద్‌ని స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంపీడీవో, మల్లాయిపాలెం గ్రామ ప్రత్యేకాధికారి డీవై.విష్ణుప్రసాద్ అన్నారు. మంగళవారం మల్లాయిపాలెం ఉర్దూ పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో జి.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక మౌలానా అబుల్ కలాం ఆజాద్ మదర్సాలో స్వాతంత్ర్య సమరయోధుడు అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సయ్యద్ జబీన్, షేక్ సర్కార్, జానీ షరీఫ్, అబ్దుల్ మున్వర్, ఖాజీ ఖలీల్ రెహమాన్, హబీబుల్లా, అబ్దుల్ ఆలీమ్, యమ్.డి ముజీబ్, షంషాద్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులందిస్తున్న పూర్ణచంద్రారెడ్డి

పామర్రు : జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఏఎన్ఎం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఒకటి నుంచి పదవతరగతి చదువుతున్న విద్యార్థుల్లో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారిలో ఒక్కొక్కరిని గుర్తించిన పామర్రు ఘంటసాల సామాజిక కళాపీఠం సౌజన్యంతో విద్యార్థులకు మంగళవారం పోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అన్నపురెడ్డి పూర్ణచంద్రారెడ్డి, హితంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతిని గుడ్లవల్లేరులో మండల మైనార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో నాగూర్ సెల్ పాయింట్ వద్ద మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి ముస్లింలు నివాళులర్పించారు. నాగూర్, సత్తార్, కరీమ్ బాబు, బాబా, ఎంఈవో -2 గోపాలరావు, కూరాడ టీడీపీ అధ్యక్షుడు కల్యాణపు నవాబు పాల్గొన్నారు.



మౌలానా అబుల్ కలాం ఆజాద్ మదర్సాలో ..



గుడ్లవల్లేరులో మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లింలు



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం

పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

● ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : గుడివాడ నియోజకవర్గ పరిధిలో ఉన్న 230 పోలింగ్ కేంద్రాల్లో 1200 మంది ఓటర్లు దాటిన 26 పోలింగ్ కేంద్రాల్లో నూతనంగా మరో 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందివాడలో 3 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న గుడివాడ అర్బన్, రూరల్ పోలింగ్ స్టేషన్‌లను ఒకే వరుస క్రమంలో ఉంచడానికి, పోలింగ్ స్టేషన్ 147, 149లను ఒకే పాఠశాల స్థానంలో మరొక గదిలోకి మార్చడానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డీవో తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్ముకునేందుకు ఆర్ఎస్‌కేల్లో నమోదు తప్పనిసరి

● వ్యవసాయాధికారి అనంతలక్ష్మీ

గుడివాడ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ముందస్తుగానే వరి ధాన్యాన్ని అమ్మటానికి సిద్ధంగా ఉండాలని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ అన్నారు. మంగళవారం మోటూరు ఆర్ఎస్‌కే సెంటర్‌లో ఏవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పొలం విస్తీర్ణం, సర్వే నెంబర్లు, వాహన నెంబర్లు ఆర్ఎస్‌కేలో నమోదు చేసుకోవాలన్నారు. ముందుగానే నమోదు చేసుకుంటే మంచిదని తెలిపారు. సుమారు ఎన్ని బస్తాలు దిగుబడి వస్తుందనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఉన్నట్లైతే రైతులు వరి కోతలు కోసి నూర్చిన వెంటనే ఆర్ఎస్‌కే సెంటర్లలోకి తోలుకోవటానికి వీలవుతుందని తెలిపారు. ప్రతీ రైతు వరి కోతలు ఈ నెలలో ప్రారంభించటానికి సిద్ధంగా ఉన్నందున ఈ వారం, పది రోజుల్లో మండలంలోని రైతులందరూ ఆర్ఎస్‌కే సెంటర్లకు వచ్చి నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మోటూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చీకటి శేషగిరిరావు, కార్యదర్శి కొణతం నారాయణరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో బోలెం అనంతలక్ష్మీ

యుద్ధప్రాతిపదికన డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

పామర్రు, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): పెదమద్దాలి దళితవాడలో డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడికను మంగళవారం పారిశుధ్య సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగించారు. దళితవాడలోని మురుగు సమస్యపై 'డ్రెయినేజీలు అస్తవ్యస్తం.. తప్పని తిప్పలు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారుల నుంచి స్పందనర లభించింది. గుడివాడ డీఎల్‌పీవో పి.సంపత్‌కుమారి, డీఎల్‌డివో రాజేష్‌ల ఆదేశాలమేరకు సంబంధిత శాఖ గ్రామస్థాయి అధికారులు స్పందించారు. కాలనీలో పంచాయతీ అధికారి పాగోలు పూర్ణచంద్రరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యార్లగడ్డ వనితల పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. దీంతో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది కాలనీలో మురుగు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. దోమల వ్యాప్తి నిరోధానికి సున్నం, బ్లీచింగ్‌లు చల్లించారు. డ్రెయినేజీల్లో నీరు సక్రమంగా పారుదల అయ్యేల చర్యలు తీసుకున్నారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులకు మోక్షం లభించడంతో ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలియజేశారు.



డ్రెయిన్లను శుభ్రపరుస్తున్న పారిశుధ్య సిబ్బంది

గౌరీశంకరస్వామి దేవస్థాన హుండీ లెక్కింపు 13న

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ అధికారులు, ధర్మకర్తల మండలి కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన గౌరీశంకరస్వామి దేవస్థాన హుండీ ఆదాయ లెక్కింపు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే భక్తులు, సేవకులు సాంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. వారి ఆధార్ కార్డు నకలును దేవస్థాన కార్యాలయంలో సమర్పించి లెక్కింపులో పాల్గొనాలని ఆయన సూచించారు.

బలహీన వర్గాల అభ్యున్నతే కూటమి లక్ష్యం

● సుమతి రామ్మోహనరావు, ఉమామహేశ్వరీ

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని పద్మశ్రీ అవార్డుగ్రహీతలు దండమూడి సుమతి రామ్మోహనరావు, దాలిపర్తి ఉమామహేశ్వరీలు అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డు ప్రాంగణంలో శ్రీసాయి నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దేవరపల్లి కోటి ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సురవరపు నాగరాజు మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీసీ వర్గాలు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణ సంఘీయుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. అనంతరం పద్మశ్రీ అవార్డుగ్రహీతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, పంద్రాజు సాంబశివరావు పాల్గొన్నారు.



పద్మశ్రీ అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న సాయినాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘ సభ్యులు

ఫిల్టర్‌బెడ్‌లకు మరమ్మతులు

గుడ్లవల్లేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు పంచాయతీ రక్షిత తాగునీటి పథకం ఫిల్టర్‌బెడ్‌లకు మంగళవారం మరమ్మతులు నిర్వహించామని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు. పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు అందించే క్రమంలో ఒక ఫిల్టర్ బెడ్ రన్నింగ్‌లో ఉండగా మరోఫిల్టర్ బెడ్‌ను మరమ్మతులు నిర్వహించి తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టామని నరసింహారావు తెలిపారు. కాగా పనులను శానటరీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ పర్యవేక్షించారు.

సీలింగ్ ఫ్యాన్లు వితరణ

గుడివాడ : స్థానిక పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి అడుసుమిల్లి వెంకట శ్రీనివాస్ సుబ్బారావు నాలుగు సీలింగ్ ఫ్యాన్‌లను బహూకరించినట్లు ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు పేర్కొన్నారు. మంగళవారం దేవస్థాన ఆవరణలో దాతకు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి స్వామి వారి శేష వస్త్రం అందజేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ చిట్టిబాబు, సభ్యులు చందు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, గొర్రెల పాండురంగారావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు తాడంకి విద్యార్థినుల ఎంపిక

పమిడిముక్కల : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ జిల్లా జట్టుకు తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. గూడురులో జరిగిన ఎంపికలో అండర్ 14 బాలికల విభాగంలో రౌతు సాయి కుమారి జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపిక కాగా ఆన్ స్టాండింగ్‌గా బి.వెంకటలక్ష్మి, పి.పల్లవి సబ్‌జూనియర్ కబడ్డీ జిల్లాజట్టుకు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో అంబటి దుర్గాకోనాల ఎంపిక కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, పీఈటీ రవీంద్రబాబు అభినందించారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

● ఏడీఏ లక్ష్మీనారాయణ



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ లక్ష్మీనారాయణ

గుడివాడ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా టీకాలు వేయించుకోవాలని పశు సంవర్థక శాఖ ఏడీఏ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం శేరిగొల్వేపల్లిలో పశుసంవర్థకశాఖ, డీఎల్‌డీఏ, లయన్స్‌క్లబ్ ఆఫ్ ప్రగతి వారి ఆధ్వర్యంలో పశువైద్య మెగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 పశువులకు గర్భం నిలవక పోవటానికి గల కారణాలు తెలుసుకుని రైతులకు సూచనలు, సలహాలు చేశామని తెలిపారు. 11 పశువులకు వివిధ శస్త్ర చికిత్సలు చేశామని తెలిపారు. పశువుల మేతను అందించేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతీ రైతు పశువుల కొష్టాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు సి.శ్రీనివాసరావు, ఏడీఏ శ్రీనివాసరావు, మండల పశువైద్యాధికారులు ఉన్నం హనుమంతరావు, జి.రామకృష్ణ, పశువైద్య సిబ్బంది, లయన్స్‌క్లబ్ ప్రగతి సభ్యులు రాంబాబు, గుంటాకోడూరు పీఏసీఎస్ అధ్యక్షుడ బసవపున్నయ్య, శేరిగొల్వేపల్లి ఎంపీటీసీ రామాంజనేయులు, శివాజీ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలకు కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ఎంపిక

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈనెల 9వ తేదీన నిర్వహించిన కృష్ణా జిల్లా అండర్-15 టేబుల్ టెన్నిస్ సెలక్షన్స్‌లో స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-15 సెలక్షన్స్‌లో బాలికల విభాగంలో అండర్-15 కేటగిరిలో పి.ఎల్.తేజశ్రీ, ఎల్.పార్వతీ, షణ్ముఖశ్రీ, ఎ.తనరికలు ఎంపికయ్యారన్నారు. బాలుర విభాగంలో కె.గీతమ్ కృష్ణ, వి.యోగిత్, పి.విలోక్, కె.దివీష్‌లు ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులు, కోచ్ ఎస్.కె గౌస్ భాషాలను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, విద్యార్థులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

విజిలెన్స్ తనిఖీల్లో రూ.12.86లక్షల వసూలు

● విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వాసు



సమావేశంలో మాట్లాడుతున్న సి.హెచ్ వాసు

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల గృహ, వాణిజ్య సముదాయాలపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రూ.12,86,000లు అపరాధ రుసుంగా వసూలు చేసినట్లు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.హెచ్ వాసు తెలిపారు. మంగళవారం స్థానిక జైన్ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.హెచ్ వాసు, గుడివాడ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అధికారులు 40 బృందాలుగా ఏర్పడి తనిఖీల్లో పాల్గొన్నారన్నారు. 3340 గృహ సర్వీస్లు, 396 వాణిజ్య సముదాయాల్లో తనిఖీలు నిర్వహించామని, వాటిలో 443 సర్వీసులకు అదనపు లోడు 643కిలో వాట్లు మొత్తానికి రూ.12.86లక్షలు అపరాధ రుసుం విధించామన్నారు. విద్యుత్ చౌర్యం చేయడం నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైన విద్యుత్ చౌర్యం జరిగితే సెల్ నెంబర్లు: 94408 12091, 94408 12362, 94408 12363కు సమాచారం అందించాలని విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాసు కోరారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ డీఈఈ నాగబాపిరాజు, గుడివాడ డీ1 ఏఈఈ కె.ఉష, లైన్ ఇన్‌స్పెక్టర్లు, పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

పేదల వైద్యానికి చంద్రబాబు భరోసా

అవనిగడ్డ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలను ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. 21 మంది లబ్ధిదారులకు రూ.34,59,941 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. మచిలీపట్నం టౌన్ : వెంకటదుర్గాంబపురంలో ఒడుగు సాంబశివరావుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఒడుగు సాంబశివరావు అందజేశారు. వక్కపట్ల శ్రీనివాసరావు, బావిరెడ్డి దానయ్య, చిల్లా సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు జమ్మలమడుగు జ్వాలా నరసింహానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును డివిజన్ ఇన్‌చార్జి కట్టా అంజిబాబు అందజేశారు. అక్కుమహంతి రాజా, శివ, వెంకటస్వామి, పామర్తి వెంకటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, మిధునవ్యాస్, శ్రీనివాసశర్మ, రాజేష్, మరీదు నాగబాబు, దీపక్ పాల్గొన్నారు.

సమాజ సేవలో మరింత ముందుకు సాగాలి

● బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు

● దోమతోటి నాగేశ్వరరావు, పి.వి.ఫణికుమార్‌కు సత్కారం



నాగేశ్వరరావు, ఫణికుమార్‌లను సత్కరిస్తున్న పోతురాజు.. తుఫాను బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పోతన స్వామి

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి పనిచేసే వారికి పదవులు వరిస్తాయని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి పోతురాజు అన్నారు. న్యాయవాద గుమాస్తాల సంఘం స్టేట్ ఫెడరేషన్ సభ్యునిగా ఎన్నికయిన దోమతోటి నాగేశ్వరరావు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికయిన పి.వి.ఫణికుమార్ లను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు మాట్లాడుతూ, 30 ఏళ్లుగా జిల్లా కోర్టులో ఫణికుమార్ న్యాయవాద గుమాస్తాగా ఉంటూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సమాజ సేవకు పాటుపడుతున్నారన్నారు. కొవిడ్ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. మరో న్యాయవాద గుమాస్తా దోమతోటి నాగేశ్వరరావు స్టేట్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఎన్నికవడం ముదావహమన్నారు. భవిష్యత్తులో వీరిద్దరూ సమాజ సేవ కార్యక్రమాల్లో ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవాద గుమాస్తాల సంఘం అధ్యక్షుడు బేతాళ గోపీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.యు. రామాంజనేయులు, టి. బాబూరావు, పి. శివరామకృష్ణ, ఎం. రాంబాబు, హెచ్‌వీఎన్ ప్రసాద్, అంకాలు, అశోక్‌కుమార్, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. గొడుగుపేట శాంతా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికయిన పి.వి. ఫణికుమార్‌ను సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, కార్పొరేటర్ అన్నం ఆనంద్, 39వ డివిజన్ టీడీపీ నాయకుడు కట్టా అంజిబాబు, దేవస్థానం ప్రధాన అర్చకుడు కందుకూరి సత్యనారాయణ శర్మ, అజ్మతున్నీసా బేగం, సర్వా లలిత కుమారి, మార్కెట్ యార్డు డైరెక్టర్ చోడవరపు ప్రసూన, గాదె శ్రీనివాసరావు, ఎం. సుబ్రహ్మణ్యం, వడ్లమన్నాటి మారుతీ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బృందావన్ థియేటర్ వద్ద పార్టీ కార్యాలయంలో ఈనెల 16న జరిగే మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ బూత్, గ్రామ, మండల, పట్టణ కమిటీల ప్రమాణ స్వీకార మహాసభకు అన్ని స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని టీడీపీ నేతలు పిలుపు నిచ్చారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకట స్వామి, రూరల్ పార్టీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, మార్కెటింగ్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, ఏపీ ఎస్‌సీడీపీ డైరెక్టర్ లంకె నారాయణ ప్రసాద్, ఇలియాస్ పాషా, తలారి సోమశేఖర్, కాగిత గోపాలరావు, లంకె హరికృష్ణ తదితరులు విలేకరులతో మాట్లాడారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావ ముఖ్యఅతిథిలుగా పాల్గొంటారన్నారు. బస్టాండ్ సెంటర్లోని నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పించి, బైక్ ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకుంటామన్నారు.

కార్యకర్తకు టీడీపీ నేతల పరామర్శ

అవనిగడ్డ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పిట్టలంక గ్రామంలో దివ్యాంగుడైన టీడీపీ కార్యకర్త అనుమకొండ వీరాంజనేయులుపై వైసీపీ నాయకులు హత్యాయత్నం చేశారు. అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించడంతో ప్రాణాపాయం తప్పింది. వైద్యం చేయిం చుకుని బంధువుల ఇంటి వద్ద తలదాచు కుంటున్న వీరాంజనేయులును మంగళవారం సాయంత్రం ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కోడూరు మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. బండే రాఘవ, అప్పికట్ల రవీంద్ర, ఘంటసాల రాజమోహనరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాను బాధితులకు ఆర్థిక సాయం

గూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి ప్రభుత్వం మంజూరు సహాయాన్ని మంగళవారం డీసీ చైర్మన్ పోతన స్వామి అందజేశారు. ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున ఏడుగురికి అందజేశారు. కూటమి నాయకులు ఎన్ఏ బేగ్, బాసంశెట్టి విజయ్, బేతల స్వామి, వీఆర్వో షేక్ కరీముల్లా, తమ్మన శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఉగ్రదాడిలో మృతులకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ఉగ్రదాడికి ప్రజా సంఘాల నిరసన

● మృతులకు కొవ్వొత్తుల నివాళి

చల్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రదాడికి నిరసనగా చల్లపల్లిలో ప్రజాసంఘాల నేతలు గాంధీజీ స్మృతివనంలో కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులు అర్పించారు. భారతదేశంపై దాడులకు తెగబడిన ఉగ్రవాద సంస్థలను, దోషులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, కాంగ్రెస్ నేత మీర్ రిజ్వాన్, ఉప్పల సాంబశివరావు, జగ్గారపు బాబూరావు, సిద్ధాబత్తుల వాసు, కొండేటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు రుణాల చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

బర్రంకుల పీఏసీఎస్‌లో రైతులకు రుణాలు

నాగాయలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బర్రంకుల పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు రుణాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి నాలుగు రైతు మిత్ర సంఘాలకు రూ.5 లక్షల చొప్పున రూ.20 లక్షలు, కర్షక మిత్ర రుణం రూ.14 లక్షలు, రైతు మిత్ర రుణాలు రూ.5.50 లక్షల చెక్కులను అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో సొసైటీ సీఈవో పల్లపోతుల శ్రీనివాస రావు, పర్సన్ల నాయుడు వెంకటేశ్వరరావు, కొప్పనాతి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సమక్షంలో జనసేనలో చేరిన బర్మా రాంబాబు

వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు బర్మా రాంబాబు జనసేనలో చేరిక

నాగాయలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గణపేశ్వరం వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు బర్మా రాంబాబు జనసేన పార్టీలో చేరారు. మంగళవారం బర్రంకుల గ్రామంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువ నాయకుడు మండలి వెంకట్రామ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. జనసేన కండువాలు వేసి స్వాగతం పలికారు. ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ తన శ్రేయోభిలాషుల కోరిక మేరకు జనసేన పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జనసేన బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్లు ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు, మండల నాయకులు బండ్రెడ్డి హరి, మోపిదేవి మండల జనసేన అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, భోగాది శివ విష్ణు, పిరాటి బలరామ్, తోట సురేష్ పాల్గొన్నారు.



కౌలు రైతు సంఘం చల్లపల్లి మండల కమిటీ నేతలు

కౌలురైతు సంఘాన్ని బలోపేతం చేయాలి

చల్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి కౌలు రైతు సంఘాన్ని బలోపేతం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు పిలుపునిచ్చారు. కౌలు రైతు సంఘం మండల రెండో మహాసభ మంగళవారం గుంటూరు బాపనయ్య భవన్‌లో లంకపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగారావు మాట్లాడుతూ, వ్యవసాయం చేస్తున్న కౌలురైతులకు న్యాయం జరగటంలేదన్నారు. యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పంట సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహాసభలో పలు తీర్మానాలు చేశారు. జిల్లా కౌలు రైతుసంఘం నాయకులు వాకా రామచంద్రరావు, మేడంకి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు యద్దనపూడి మధు, మోపిదేవి మండల కార్యదర్శి మరీదు సురేష్‌లు మాట్లాడారు. మండల కౌలు రైతుసంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లంకపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పసుపులేటి నాంచారమ్మ, కార్యదర్శిగా కోలా హరిబాబు, సహాయ కార్యదర్శిగా ముమ్మనేని సాయిబాబు, కోశాధికారిగా మందపాకల గోవిందు, సభ్యులుగా మేడేపల్లి భిక్షం, డొక్కు సోమరాజు, రుద్రపాటి శ్రీహరి, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, సూదాని పాములు ఎన్నికయ్యారు.

శివాలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించండి



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు వివరాలు తెలియజేస్తున్న టీడీపీ నేతలు

ఘంటసాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జునస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), గ్రామ పార్టీ అధ్యక్షుడు దాసం రామకృష్ణ పాపవినాశనం టీడీపీ నేత కుంపటి చిట్టిబాబు తదితరులు మంగళవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కలిసి దేవాలయ పరిస్థితిని వివరించారు. దేవాలయ పునర్నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు రూ.3.70కోట్లతో అంచనాలు సిద్ధం చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. దేవదాయశాఖ కమిషనర్‌తో మాట్లాడి నిధులు మంజూరు ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. కొండవీటి కృష్ణ, గాదె వెంకటేశ్వర



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజా

శాంతిభద్రతల పరిరక్షణకు గ్రామాల దత్తత

● డీఎస్పీ రాజా

పెడన, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెడన పోలీసు స్టేషన్ పరిధిలో గత ఏడాదిలో పోలిస్తే ఈ ఏడాది క్రైమ్ రేటు గణనీయంగా తగ్గిందని డీఎస్పీ సిహెచ్. రాజా తెలిపారు. పెడన పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పెడన పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రవాణా, మునిసిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి, తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు పోలీసులు గ్రామాలను దత్తత తీసుకుని శాంతి భద్రతలను పర్యవేక్షించే విధానాన్ని అమలు చేస్తామన్నారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసుల పురోగతిని సమీక్షించారు. సీఐ కె. నాగేంద్ర ప్రసాద్, ఎస్సై జి. సత్యనారాయణ, ట్రైనీ ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో మంగళవారం బాంబు స్క్వాడ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మచిలీపట్నం రైల్వేస్టేషన్ ప్రాంతం, ఆర్టీసీ కార్గో, సైకిల్ స్టాండ్, బస్టాండ్ ఆవరణ తదితర ప్రాంతాల్లో మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేశారు.



చిన్నాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లంకె నారాయణప్రసాద్, లక్ష్మీపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండలి వెంకట్రామ్

రైతులను ఆదుకునేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపానుకు దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం ఆదుకుంటుందని మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. చిన్నాపురం పీఏసీఎస్‌లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు, చిన్నాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు పినిశెట్టి నిరంజన్, రాజులపాటి సత్యనారాయణ, కాట్రం నాంచారయ్య, కంచర్ల వెంకటేశ్వరరావు, చలమలశెట్టి రమణ పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

చల్లపల్లి : లక్ష్మీపురం పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం యువనేత మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో రైతుకు మేలు జరిగేలా ఎన్నో నిర్ణయాలు తీసుకుందన్నారు. రైస్‌మిల్లును ఎంచుకునే నిర్ణయం రైతులకు ఇచ్చిందన్నారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ చైర్మన్ యార్లగడ్డ సోమశేఖరప్రసాద్(లంకబాబు) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏవో కె.మురళీకృష్ణ, డైరెక్టర్లు తోట రాజేశ్వరరావు, సూదాని పూర్ణచంద్రరావు, నీటి సంఘం అధ్యక్షుడు గొరిపర్తి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు నూకల వెంకటేశ్వరరావు, కొత్తపాలెం సొసైటీ చైర్మన్ పూషడపు రత్నగోపాల్, సొసైటీ మాజీ చైర్మన్ చలమలశెట్టి శేషుబాబు, సీఈవో లంకపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించనున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ సంతకాల సేకరణ

మోపిదేవి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం మోపిదేవిలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయగా, కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేయాలని చూస్తుండటం దారుణమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను నిరసిస్తూ అవనిగడ్డలో 12వ తేదీన ర్యాలీ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. గరికపాటి వెంకటేశ్వరరావు, సింహాద్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల బాలబాలికలకు ఉచిత ఉపకరణాల శిబిరం

చల్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాల బాలబాలికలకు ప్రభుత్వం ఉపకరణాలు అందిస్తున్నట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త కళ్లేపల్లి ఏడుకొండలు తెలిపారు. చల్లపల్లి జడ్పీ హైస్కూల్‌లో సమగ్ర శిక్ష జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల బాలబాలికలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. అలింకో నుంచి వచ్చిన డాక్టర్ రుక్మిణి పిల్లలను పరీక్షించి వారికి అవసరమైన వీల్‌చైర్స్, సీపీ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్, వాకర్స్, ఎమ్మార్ కిట్లు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. త్వరలో ఉపకరణాలు సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయానికి చేరతాయనీ, తర్వాత లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని ఏడుకొండలు తెలిపారు. ఎంఈవోలు సుజాత, పి.వెంకటేశ్వరరావు, శివశంకర్, మోమిన్, రమణ, భానుప్రకాష్, ఏఎంవో శ్యామ్, జీసీడీవో సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన సుమారు 120 మంది బాలబాలికలు శిబిరంలో పాల్గొన్నారు.

మండలి వెంకటకృష్ణారావుకు ఘన నివాళులు

అవనిగడ్డ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : శత జయంతి వేడుకల్లో భాగంగా టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో పులిగడ్డ టోల్‌ప్లాజా వద్ద మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పించారు. చిట్టిబాబు మాట్లాడుతూ దివిసీమ అభివృద్ధికి వెంకట కృష్ణారావు చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ, జనసేన నేతలు చందన నరసింహారావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, మొఘల్ మురాద్ బేగ్, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, యేసుబాబు, భోగాది బాలకృష్ణ, పిరాటి రాంబాబు, రాజులపాటి తాండవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు ఆర్థిక సాయం



మచిలీపట్నం టౌన్ , నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులను ఆదుకుందామని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ అన్నారు. శా యన వీరభద్రయ్య, వీర రాఘవమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశా రు. సేవా సమితి అధ్యక్షుడు, రిటైర్డు ఏఎస్పీ శాయన సుశీలరావు, మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ, జనసేన నాయకుడు మణిబాబు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



బల్లిపర్రులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో జెన్నీ

పెడన రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి ఎస్. జెన్ని అన్నారు. బల్లిపర్రులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు తాము పండించిన పంట అమ్మేందుకు, ఇతర సదుపాయాలు పొందేందుకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరన్నారు. బల్లిపర్రు గ్రామంలో ధాన్యం రాశులను ఆమె పరిశీలించారు. మండలంలో 18 ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 2029 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చుశామన్నారు.

కరకట్ట మీదుగా హైదరాబాద్‌కు బస్సులు నడపాలి

ఘంటసాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ డిపో నుంచి కరకట్ట మీదుగా హైదరాబాద్ సర్వీసులు నడపాలని అవనిగడ్డ డిపో మేనేజర్ హనుమంతరావుకు టీడీపీ నేతలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రతిరోజు రాత్రి 8 గంటల సమయంలో కోడూరు నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్ సర్వీసు నడుపుతున్నారన్నారు. ఆ సర్వీసు సకాలంలో రాకపోవటంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు కరకట్ట మీదుగా వెళ్లేలా సర్వీసులను నడపాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టీడీపీ నేతలు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), కుంపటి చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల గ్రామసభలు

నాగాయలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులను గుర్తించేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఏపీవో ముత్యాలు తెలిపారు. మంగళవారం భావదేవరపల్లిలో 82 పనులను రూ. 6.70 లక్షలు, టి.కొత్తపాలెంలో 52 పనులను రూ.3.91 లక్షలు, పెదపాలెంలో 69 పనులను రూ.4.80 లక్షలు, నాగాయలంకలో 16 పనులను రూ.1.20 లక్షలతో చేసేందుకు గ్రామసభల ఆమోదం పొందినట్లు ఏపీవో ముత్యాలు తెలిపారు. ఈ గ్రామసభల్లో సర్పంచ్‌లు, మేట్లు, రైతులు పాల్గొన్నారు.

సీఆర్ వికాసకేంద్రంలో ఉచిత నేత్ర పరీక్ష శిబిరం

చల్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ అగ్రనేత కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు స్మారకార్థం నిర్మించిన సీఆర్ వికాసకేంద్రంలో మంగళవారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం జరిగింది. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల డాక్టర్ పవిత్ర, డాక్టర్ దివ్యమాధురి రోగులను పరీక్షించి మందులను ఉచితంగా అందజేశారు. ముగ్గురికి ఐఓఎల్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ట్రస్ట్ ప్రతినిధి అడ్డాడ ప్రసాద్‌బాబు శిబిరాన్ని పర్యవేక్షించారు. వికాస కేంద్రంలో ప్రతినెలా రెండో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా రామాంజనేయులు

పెడన, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెడన ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్‌గా ఏఈ రామాంజనేయులు నియమితులయ్యారు. కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి పదవీ విరమణ చేయడంతో ఏఈగా పనిచేస్తున్న రామాంజనేయులును పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.